# తబూక్ యుద్ధ నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.11.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధాలు వాటిలో ఆయన జీవిత చరిత్ర గురించి ప్రస్తావించబడుతుంది. ఈ సందర్భంలో తబూక్ యుద్ధ వివరాలు వివరించబడుతున్నాయి, దాని గురించి మరిన్ని వివరాలు ఇట్లున్నాయి. ఈ సందర్భంగా ఒక మహిళ గొప్ప నిష్కల్మషత, ఉత్సాహాన్ని ప్రదర్శించినట్లు వ్రాయబడింది. దాని గురించి ప్రస్తావిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఇలా అన్నారు. సైన్యం సిరియా వైపు వెళ్ళవలసి ఉన్నందున, మౌతా యుద్ధ దృశ్యం ముస్లింల కళ్ళ ముందు ఉన్నందున, ప్రతి ముస్లిం హృదయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణ సంరక్షణ గురించిన ఆలోచన అన్ని ఆలోచనల కంటే అధికంగా ఉండెను. మహిళలు కూడా ఈ ప్రమాదాన్ని గ్రహిస్తూ, తమ భర్తలను, కొడుకులను యుద్ధానికి వెళ్ళమని ప్రోత్సహిస్తుండిరి.

ఈ నిష్కల్మషత, ఉత్సాహం ఈ విధంగా అంచనా వేయబడుతుంది. ఏదో పని నిమిత్తం బయటకు వెళ్ళిన ఒక అనుచరుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యంతో సహా మదీనా నుండి బయలుదేరిన తరువాత తిరిగి వచ్చాడు. కొంతకాలం దూరమున్న తరువాత తన భార్యను చూసి సంతోషిస్తాననే ఆలోచనతో అతను తన ఇంట్లోకి ప్రవేశించాడు. అప్పుడు అతను తన భార్యను పెరట్లో కూర్చుని ఉన్నట్లు చూసి, ప్రేమతో ముద్దు పెట్టుకోవడానికి ముందుకు వెళ్ళాడు. అతను తన భార్య దగ్గరకు రాగానే ఆమె రెండు చేతులతో అతన్ని వెనక్కి నెట్టివేసి వెనక్కి జరిపింది. అనంతరం ఆమె ఇలా అంది. దైవ ప్రవక్త ఆ ప్రమాదకరమైన ప్రదేశానికి వెళుతున్నారు కానీ నువ్వు నీ భార్యను ప్రేమించడానికి ధైర్యం చేస్తున్నావా?. ముందు వెళ్ళి నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు ఆ తరువాత ఈ విషయాలను చూద్దాం. ఆ అనుచరుడు వెంటనే ఇంటి నుండి బయటకు వెళ్ళారు మరియు తన సవారీకి జీను కట్టి మూడు ప్రాంతాల దూరం వెళ్ళాక దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కలుసుకున్నారు. దైవ ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లం తన ఇతర అనుచరులతో మదీనాకు తిరిగి వచ్చినప్పుడు మాత్రమే అతను తిరిగి ఇంటికి వచ్చారు. సంక్షిప్తంగా చెప్పాలంటే వీరు ప్రతి ప్రమాదకర సందర్భంలో తమ ప్రాణాలను వెనుకాడకుండా ప్రమాదంలో పడేసిన వ్యక్తులు. ఏ కష్టం లేదా బాధను కూడా వారు కష్టంగా లేదా బాధగా భావించలేదు. బదులుగా ఎప్పుడైతే ఏదైనా సేవ చేసే అవకాశం వచ్చినా వారు తమ ప్రాణాలను సంతోషంగా అర్పించేవారు.

హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు. ఏదేమైనా దీని వివరాలలో ఇట్లు వ్రాయబడింది. పదిహేను లేదా కొన్ని కథనాల ప్రకారం పందొమ్మిది ప్రాంతాలలో బస చేస్తూ, వారు తమ అనుచరులతో సహా తబూక్ ప్రాంతానికి చేరుకున్నారు. తబూక్ ప్రయాణంలో ఎక్కడెక్కడ బస చేశారనే ప్రత్యేక వివరాలు లభించనప్పటికీ తరువాత ఆ ప్రదేశాలలో మసీదులు నిర్మించబడ్డాయి. ఆ ప్రాంతాల పేర్లను బట్టి మసీదులకు పేర్లు పెట్టబడ్డాయి. కాబట్టి చరిత్రకారులు దీని నుండి వివరాలను వివరిస్తూ, ఈ ప్రదేశాలలోనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బస చేసి ఉంటారని తెలిపారు.

ఒక కథనంలో హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ ఇలా వివరించారు. మేము తబూక్ యుద్ధంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి బయలుదేరాము. ఒక రాత్రి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం నిద్రపోయి ఉండగా సూర్యుడు ఒక ఈటె అంత ఎత్తుకు వచ్చినప్పుడు మాత్రమే మేల్కొన్నారు. అప్పుడు ఆయన ఇలా అన్నారు: ఓ బిలాల్! మన కొరకు ఫజ్ర్ నమాజ్ కోసం ఎదురుచూడమని నేను నీకు చెప్పలేదా?. హజ్రత్ బిలాల్ (రజి) ఇలా విన్నవించారు. ఓ దైవ ప్రవక్తా! మీలాగే నన్ను కూడా నిద్ర ఆవహించింది. ఈ కథనం తెలిపే వ్యక్తి ఇలా వివరించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యాన్ని బయలుదేరమని ఆదేశించారు. కొంత దూరం ప్రయాణించిన తరువాత వారు తమ సవారీ నుండి దిగి సున్నత్‌లు చేశారు. అనంతరం అనుచరులకు నమాజ్ చేయించారు. ఆ తరువాత, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం పగలంతా రాత్రంతా ప్రయాణించి తరువాతి రోజు ఉదయం తబూక్ చేరుకున్నారు.

తబూక్ చేరుకున్న తరువాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తఆలాను స్తుతించి, అనుచరులకు ఉపన్యాసమిస్తు, సమగ్రమైన ఉపదేశాలు చేస్తూ దుఆ చేశారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఓ అల్లాహ్! నన్ను, నా ఉమ్మత్‌ను క్షమించు. ఈ విషయాన్ని ఆయన మూడు సార్లు పునరావృతం చేశారు. తరువాత ఆయన ఇలా అన్నారు. నేను అల్లాహ్‌తో నా కోసం, మీ కోసం క్షమాపణ కోరుతున్నాను".

ఈ సందర్భంగా హెరాక్లియస్‌కు ఇస్లాంను ఆహ్వానిస్తూ పంపిన లేఖ గురించి కూడా ప్రస్తావన లభిస్తుంది. ఆ లేఖను హెరాక్లియస్‌కు ఇచ్చినప్పుడు అతను దానిని చదివి మీ ప్రవక్త వద్దకు తిరిగి వెళ్ళండి, నేను అతని అనుచరుడిని అని చెప్పండి, కానీ నేను నా రాజ్యాన్ని విడిచిపెట్టడానికి ఇష్టపడను అని అన్నాడు. అతను కొన్ని దీనార్లను కూడా ప్రవక్త సేవకు పంపాడు. ఈ విషయం గురించి దైవ

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిపినప్పుడు, ఆయన అతను అబద్ధం చెప్పాడు అని అన్నారు. ఆ దీనార్లను ప్రజలలో పంపిణీ చేశారు.

చరిత్రలో ఐలా ప్రజలతో శాంతి సంధి గురించి ప్రస్తావించబడింది. తబూక్‌లో బస చేసిన సమయంలో ఐలా పాలకుడు, అతనితో పాటు సిరియా ప్రజలు, యెమెన్ ప్రజలు, బహ్రైన్ ప్రజలు, జర్బా ప్రజలు, అజ్రుహ్ ప్రజలు కూడా వచ్చారు, వారు కూడా సంధి కోసం అభ్యర్థించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారికి ఒక భద్రతా పత్రాన్ని వ్రాయించారు. తరువాత మక్నా ప్రజలు అనే యూదులతో శాంతి ఒప్పందం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారికి కూడా ఒక భద్రతా పత్రాన్ని వ్రాసి ఇచ్చారు.

తబూక్ యుద్ధ సందర్భంలోనే హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ నేతృత్వంలో ఉకైదర్ బిన్ అబ్దుల్ మాలిక్ వైపుకు పంపబడిన ఒక సరయ్య గురించి కూడా ప్రస్తావించబడింది. ఉకైదర్ బిన్ అబ్దుల్ మాలిక్ బనూ కిందహ్ తెగకు చెందిన క్రైస్తవ రాజు. అతని కోట తబూక్ నుండి 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఖాలిద్‌తో ఇలా అన్నారు. అతను ఆవును వేటాడే సమయంలో రాత్రి వేళలో నీకు కనిపిస్తాడు, నువ్వు అతన్ని పట్టుకో. తరువాత ఆయన ఇలా అన్నారు. అల్లాహ్ తఆలా నిన్ను దౌమతుల్ జందల్‌ను జయించేలా చేస్తాడు. నువ్వు అతన్ని పట్టుకుంటే, అతన్ని చంపకు, నా దగ్గరకు తీసుకురా. ఒకవేళ అతను నిరాకరించి, పోరాడితే, అప్పుడు అతన్ని చంపవచ్చు. అలాగే జరిగింది.

తబూక్ సందర్భంగా ఒక అనుచరుడు, హజ్రత్ అబ్దుల్లాహ్ జుల్ బజాదైన్ ముజ్నీ మరణం, సమాధి చేయబడడం గురించి కూడా ప్రస్తావించబడింది. దీనిని చూసి కొందరు పెద్ద అనుచరులు అయ్యో! ఈ సమాధి చేయబడిన వ్యక్తి స్థానంలో మేము ఉంటే బాగుండేది అని కోరుకున్నారు. ఇదేవిధంగా, ఈ ప్రయాణంలో హజ్రత్ ముఆవియా బిన్ ముఆవియా ముజ్నీ అంత్యక్రియ నమాజ్ గురించి కూడా ప్రస్తావించబడింది.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ ఇలా వివరించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్‌లో ఉన్నప్పుడు, జిబ్రాయిల్ వచ్చి, ఓ దైవ ప్రవక్తా! ముఆవియా ముజ్నీ మదీనాలో మరణించారు, అతని అంత్యక్రియ నమాజ్ చేయండి అని అన్నారు. తరువాత, అతని శవం ఉన్న మంచం గాలిలో ఎత్తబడింది. అది హుజూర్ కళ్ళ ముందు కనిపించింది. ఆయన అంత్యక్రియ నమాజ్ చేశారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ముందు దేవదూతల వరుసలు కూడా ఉన్నాయి. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జిబ్రాయిల్‌ను అడిగారు, అతనికి ఈ స్థాయి ఎలా లభించింది? జిబ్రాయిల్ ఇలా జవాబిచ్చారు. ఖుల్ హువల్లాహు అహద్ అనగా ఇఖ్లాస్ అధ్యాయం పట్ల ఉన్న ప్రేమ కారణంగా, అతను లేస్తున్నప్పుడు, కూర్చుంటున్నప్పుడు, సవారీ చేస్తూ, నడుస్తూ, ప్రతి స్థితిలో దానిని పఠించేవారు.

తబూక్ చేరుకున్న తరువాత, మరింత ముందుకు వెళ్లడానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి

వసల్లం అనుచరులను సంప్రదించినట్లు కూడా ప్రస్తావించబడింది. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇలా విన్నవించారు: ఓ దైవ ప్రవక్తా! రోమన్ల వద్ద చాలా సైన్యాలు ఉన్నాయి, వారిలో ముస్లింలు ఎవరూ లేరు. మనం వారికి దగ్గరగా వచ్చాము, మీ రాక వారందరినీ భయపెట్టింది. మనం ఈ సంవత్సరం తిరిగి వెళ్దాం, తద్వారా ఏదైనా మంచి అభిప్రాయం ఏర్పడుతుంది లేదా అల్లాహ్ తఆలా ఏదైనా పరిస్థితిని సృష్టిస్తాడు. ఏదేమైనా, ఈ మాట విన్న తరువాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇరవై రోజులు తబూక్‌లో బస చేసిన తరువాత వెళ్లాలని నిర్ణయించుకున్నారు, మరొక అభిప్రాయం ప్రకారం, ఆయన ఇరవై రోజుల కంటే తక్కువ రోజులు తబూక్‌లో బస చేశారు.

మదీనా నుండి బయలుదేరి తిరిగి వచ్చే వరకు రెండు నెలలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పట్టింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి మదీనాకు వచ్చే ప్రయాణ వివరాలు తర్వాత ప్రస్తావించబడును. ఇన్ షా అల్లాహ్.

హుజూరె అన్వర్ ఇలా అన్నారు. నేను గతంలో కూడా బంగ్లాదేశ్ గురించి ప్రార్థన చేయమని అడిగాను. అక్కడ అహ్మదియ్యత్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గం చాలా గొడవ చేస్తోంది. అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీని వారి కీడు నుండి రక్షించుగాక! ఇదేవిధంగా, పాకిస్తాన్ అహ్మదీల కోసం, అల్లాహ్ తఆలా వారిని కూడా సురక్షితంగా ఉంచాలని కూడా ప్రార్థించండి. ఇప్పుడు చాలా ఎక్కువ ప్రార్థనల అవసరం ఉంది. ఇదేవిధంగా, మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్) కోసం, ఒప్పందాలు, కాల్పుల విరమణ ఉన్నప్పటికీ వారిని అలాగే చంపడం జరుగుతోంది, అల్లాహ్ తఆలా దయ చూపాలని కూడా ప్రార్థించండి. ఇదేవిధంగా, ఆఫ్రికాలోని అహ్మదీల కోసం ప్రార్థించండి. అక్కడ కూడా కొన్ని చోట్ల ప్రభుత్వాలు వారిపై అన్యాయం చేస్తున్నాయి, కొన్ని చోట్ల ఉగ్రవాదులు వివిధ ప్రాంతాలపై దాడులు చేస్తున్నారు, కొన్నిసార్లు అహ్మదీలు కూడా దీని బారిన పడుతున్నారు. అల్లాహ్ తఆలా ప్రపంచమంతటా శాంతి, భద్రతను స్థాపించుగాక! (ఆమీన్)

చివరికి, హుజూరె అన్వర్ రబ్వాకు చెందిన ముహమ్మద్ హుస్సేన్ గారు వల్దు ముహమ్మద్ ఇస్మాయిల్ గారి సద్గుణాలను ప్రస్తావించి, వారి పరోక్ష అంత్యక్రియ నమాజ్ చేయిస్తానని ప్రకటించారు. మృతుని క్షమాపణ ఉన్నత స్థాయి కోసం దుఆ చేశారు.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔